
సాక్షి
పల్నాడు
మంగళవారం ॥ 23 ॥ మే ॥ 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3 000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.90 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.90 అడుగుల వద్ద ఉంది.

మహంకాళీ దేవస్థానానికి విరాళం



తాడేపల్లి రూరల్ : కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ దేవస్థానానికి విజయవాడకు చెందిన ఒడుగు సురేష్, శ్యామల దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. నగదును సోమవారం ఆలయ ఈవో వెంకటరెడ్డికి అందజేశారు.

న్యూస్‌రీల్

ఫేస్ యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు

పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి



నరసరావుపేట రూరల్: వేలిముద్రలు పడని రైతులంతా పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని జొన్నలగడ్డ రైతుభరోసా కేంద్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు సమస్యలతో ఇబ్బందులు పడే రైతులు ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఈ.మస్తానమ్మ, విస్తరణాధికారులు కె.బ్రహ్మయ్య, పి. గోపిరెడ్డి, సహాయకులు పిలిఫ్, పవన్‌కుమార్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఆర్బీకేలకు బడ్జెట్ విడుదల

కొరిటిపాడు(గుంటూరు): 2023-24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)కు మొదటి క్వార్టర్ బడ్జెట్ విడుదలైంది. గుంటూరు జిల్లాలో 249 కేంద్రాలకు గానూ రూ.2,10,39,630 మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషనరీ కోసం రూ.75,052, ఆర్బీకేల నిర్వహణ (మెయింటెనెన్స్) కోసం రూ.2,49,000, ఇంటర్నెట్ కోసం రూ.13,85,934, అడ్మినిస్ట్రేటివ్ ఖర్చుల కోసం రూ.63,318 విడుదల చేసింది. అద్దె చెల్లింపులకు రూ.1,92,66,326 మంజూరైనట్లు వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తెలిపారు.

26న వినుకొండలో మెగా జాబ్ మేళా



నరసరావుపేట: వినుకొండలో ఈనెల 26న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో గల ఫస్ట్ వార్డ్ గరల్స్ హైస్కూలులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జాబ్ మేళాకు 14 కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. జీతం అర్హతను బట్టి రూ.10వేలు నుంచి రూ.30వేలు వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదివిన 18ఏళ్ల నుంచి 40ఏళ్లలోపు యువతీ యువకులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన తెలిపారు. ముందుగా www.aprrdc.in అనే వెబ్‌సైటులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వీలుకాని పక్షంలో జాబ్ డ్రైవ్ జరిగే ప్రదేశంలో చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు పాల్గొన్నారు.

శరత్‌బాబుకు అమరావతితో అనుబంధం

అమరావతి: ప్రముఖ నటుడు శరత్‌బాబుకు అమరావతితో అనుబంధం ఉంది. పెళ్లీడుపిల్లలు సినిమా షూటింగ్‌ను ఇక్కడే జరిపారు. బాపు దర్శకత్వంలో 1982లో దుక్కిపాటి మధుసూదనరావు అతి తక్కువ బడ్జెట్‌లో దీన్ని నిర్మించారు. సినిమా షూటింగ్‌ను అమరావతిలోని రాజాగారి కోట, అమరేశ్వర స్వామి దేవాలయం, కృష్ణానది లంకలు, వైకుంఠపురం గ్రామ పరిసరాల్లో నెల రోజుల పాటు చేశారు. సురేష్, విజయశాంతి, సాయిచంద్, సుమలత, సోమయాజులు తదితర నటులు నటించారు. శరత్‌బాబు నటి సంగీతలో కలసి ముఖ్యపాత్రలో నటించిన సన్నివేశాల్ని, జ్ఞాపకాల్ని అమరావతి గ్రామస్తులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

‘అగ్రి’పథాన నిలవాలి



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్ , వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు



జీవితం అంత తేలిక కాదు.. మీలో మీరు బలంగా ఉన్నప్పుడే తేలికగా కనిపిస్తుంది. నీ కష్టాలకంటే నీవు పెద్దవాడివి.. నిన్ను జయించేలా చేసేందుకు నిన్ను మించినవాడు లేడు. నీ లక్ష్యాల్ని చేరుకోవడానికి నీకు ఎవరి సానుభూతి అక్కర్లేదు. మీరు మాత్రమే మీ కలల్ని నేరవేర్చుకోగలరు. నక్షత్రాలకు ఎగరాల్సిన వారు పర్వతాన్ని అధిరోహించడం చాలా చిన్న విషయం...

– గవర్నర్

- విద్యార్థులు ఐసీఏఆర్ అవార్డులు సాధించడం హర్షణీయం
- ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్లలోని ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో సోమవారం నిర్వహించిన 55వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు, అందుకు కారకులైన అధ్యాపకుల్ని ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచి ఐసీఏఆర్ అవార్డులు సాధించడం, పీజీ స్కాలర్‌షిప్‌లు పొందడం అభినందనీయమని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం యూనివర్సిటీ చేస్తున్న కృషిని కొనియాడారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఐసీఏఆర్ 2021 డిసెంబర్ 3న అగ్రికల్చరల్ యూనివర్సిటీ ర్యాంకింగ్ సిస్టం (ఏయూఆర్‌ఎస్) కింద జాతీయ ర్యాంకింగ్‌లను ప్రకటించగా, 2020-21 సంవత్సరానికి జాతీయ స్థాయిలో 11వ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో 7వ స్థానాన్ని సాధించిందని తెలిపారు. జాతీయ స్థాయిలో వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగంలో స్కాచ్ సిల్వర్ అవార్డు- 2022, స్కాచ్ ఆర్డర్ అఫ్ మెరిట్ అవార్డు లభించినట్లు చెప్పారు. తిరుపతిలో అభివృద్ధి చేసిన రెండు యంత్రాలు (మల్టీ టాస్క్ టూల్ బార్, నాప్సాక్ వీడర్) వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ ద్వారా వినూత్న వ్యవసాయ యంత్రాలుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. దీనికి గానూ భారత ప్రభుత్వం కాపీరైట్ కార్యాలయం ద్వారా 2020 జూన్ 8న విశ్వవిద్యాలయం ఫర్టిలైజర్ ప్లానర్ 2015కు కాపీ హక్కు (పేటెంట్) మంజూరు చేశారని తెలిపారు. ఐసీఏఆర్‌లో అత్యధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లు పొందిన యూనివర్సిటీల్లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్నందుకు సహకరించిన సిబ్బందికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

పలు అవార్డుల ప్రదానం

స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ అధ్యాపకులు, విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. టీచింగ్ విభాగంలో మెరిటోరియస్ టీచర్ అవార్డు, రీసెర్చ్ శాస్త్రవేత్తలు, విస్తరణ శాస్త్రవేత్తలు, యువ శాస్త్రవేత్తల అవార్డుల్ని నలుగురికి అందజేశారు. పీజీకి సంబంధించి 22 మందికి, అండర్ గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి 10 మందికి పురస్కారాలు అందజేశారు. అనంతరం స్నాతకోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, కళాశాల అసోసియేట్ డీన్ వి. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గుంటూరుకు సీఎం వై.ఎస్. జగన్

ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరు నగర పర్యటన దృష్ట్యా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ మార్గాల మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సోమవారం తెలిపారు. సీఎం ప్రయాణించే సమయంలో శ్యామలానగర్, పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌ను అనుమతించరు.

- జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే వాహనాలు, ఎత్తు రోడ్డు సెంటర్, జీటీ రోడ్డులోని ఐటీసీ నుంచి నగరంపాలెం పీఎస్, ఎస్‌బీఐ జంక్షన్ వైపు వాహనాల్ని కూడా మస్తాన్ దర్గా, ఎత్తు రోడ్డు సెంటర్ రోడ్డు మీదుగా మళ్లిస్తారు.
- నగరంపాలెం ఎస్‌బీఐ జంక్షన్ నుంచి కంకరగుంట బ్రిడ్జి వైపు వెళ్లే వాహనాల్ని మెడికల్ కాలేజీ రోడ్డు వైపునకు, ఏటీ అగ్రహారం, కంకరగుంట వైపు నుంచి కలెక్టరేట్ ఎదురు రోడ్డుకు వచ్చే వాటిని కంకరగుంట అండర్ బ్రిడ్జి మీదుగా పట్టాభిపురం వైపు మళ్లిస్తారు.
- కలెక్టరేట్ నుంచి కంకరగుంట బ్రిడ్జి మీదుగా పట్టాభిపురం వైపునకు వెళ్లే వాహనాలకు అనుమతి ఉండదు.
- పట్టాభిపురం, రవీంద్రనగర్, శ్యామలానగర్, గుజ్జనగుండ్ల మీదుగా కలెక్టరేట్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను టీజేపీఎస్ కళాశాల వద్ద కంకరగుంట ఫ్లైఓవర్ పైకి మీదకు అనుమతించరు. అండర్ పాస్ ద్వారా కలెక్టరేట్ వైపు అనుమతిస్తారు.
- సీఎం ప్రయాణించే మార్గంలోని శ్యామలానగర్ ఒకటి, రెండు, మూడో రోడ్ల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. శ్యామలానగర్ రైల్వేగేటు నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంటు సెంటర్ వైపు వచ్చే వాహనాల్ని అందుబాటులో ఉన్న మార్గాల వైపు మళ్లిస్తారు.
- హౌసింగ్ బోర్డ్, ఎన్జీవో కాలనీ నుంచి శ్యామలానగర్ రైల్వేగేటు వైపు వచ్చే వాహనాలు నల్లపాడు నుంచి చుట్టుగుంట వైపు వెళ్లే రోడ్డును వినియోగించాలి.
- శ్యామలానగర్ గేటు వైపు వచ్చే వారు దాటకుండా, ఆర్.అగ్రహారం పక్కనున్న రోడ్డు ద్వారా కంకరగుంట అండర్ పాస్‌కు వెళ్లి, అక్కడ నుంచి పట్టాభిపురం వైపు, మరో అండర్ పాస్ ద్వారా కలెక్టరేట్ వైపు మళ్లాలి.

‘స్పందన’ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ప్రజల నుంచి 150 అర్జీల స్వీకరణ

నరసరావుపేట: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంతో కలసి కలెక్టర్ ప్రజల నుంచి 150 అర్జీల్ని స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమస్యల్ని సంబంధిత జిల్లా అధికారులకు అందజేసి, పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు.



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్

ఇంటర్ ‘అడ్వాన్స్‌డ్’కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి జూన్ ఒకటో తేదీ వరకు పరీక్షలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 100 కేంద్రాలు
- హాజరుకానున్న 49,771 మంది విద్యార్థులు
- కలెక్టర్ల అధ్యక్షతన ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు
- ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐవో గర్నెపూడి సునీత వెల్లడి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఐవో గర్నెపూడి సునీత చెప్పారు. సాంబశివపేటలోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 100 పరీక్ష కేంద్రాల పరిధిలో 49,771 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. వీరిలో ప్రథమ సంవత్సరం 36,173, ద్వితీయ సంవత్సరం 13,598 మంది ఉన్నారని వివరించారు. గుంటూరు జిల్లా పరిధిలోని 54 కేంద్రాల్లో 28,149, పల్నాడు జిల్లాలోని 34 కేంద్రాల పరిధిలో 16,631, బాపట్ల జిల్లాలోని 12 కేంద్రాల్లో 4,991 మంది చొప్పున హాజరు కానున్నట్లు తెలిపారు. జూన్ 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న జరగనున్న ఎన్విరాన్‌మెంటల్ పరీక్షలకు గతంలో తప్పిన, గైర్హాజరైన ఫస్టియర్ విద్యార్థులు విధిగా హాజరుకావాలని ఆమె స్పష్టం చేశారు. ఇంటర్ పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థుల సహా విధుల్లో ఉన్న ఏ ఒక్కరికీ సెల్‌ఫోన్లతో వచ్చేందుకు అనుమతి లేదని చెప్పారు. పరీక్షల విధుల్లో ఉన్న అధికారులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, ఇన్విజిలేటర్ల వద్ద సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదన్నారు. సమావేశంలో డీఈసీ సభ్యులు జి. బాలమోహన్‌రావు, పి.సుధాకర్, పాండురంగారావు పాల్గొన్నారు.

ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో...

- ప్రథమ సంవత్సర పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు.
- విద్యార్థులు నిర్దేశిత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యంగా వచ్చే వారిని అనుమతించరు.
- విద్యార్థులు హాల్ టికెట్, ప్యాడ్, పెన్ను మరే ఇతర సామగ్రి వెంట తీసుకు రాకూడదు.

ప్రత్యక్ష నిఘా .. విస్తృత తనిఖీలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 100 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.
- ఇంటర్‌బోర్డు నుంచి ఉన్నతాధికారులు లైవ్ స్ట్రీమింగ్ విధానంలో ప్రత్యక్షంగా పరిశీలిస్తారు.
- పరీక్ష కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసుల నిరోధానికి బోర్డు నుంచి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు మూడు జిల్లాల కలెక్టర్ల సారథ్యంలో తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తాయి.
- సమస్యలు, సందేహాల పరిష్కారానికి గుంటూరు ఆర్‌ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (0863-2228528) ఏర్పాటు

60 శాతం బెటర్‌మెంట్ విద్యార్థులే..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో ఫస్టియర్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏకంగా 36,173 మంది దరఖాస్తు చేయగా, వీరిలో పరీక్షల్లో తప్పిన విద్యార్థుల కంటే అధిక మార్కుల కోసం బెటర్‌మెంట్ రాస్తున్న వారు 60 శాతం మంది ఉండటం గమనార్హం.

పకడ్బందీగా పట్టాల పంపిణీ

- అన్ని ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్లు వేణుగోపాలరెడ్డి, ఢిల్లీరావు

తాడేపల్లి రూరల్ : నవరత్నాల్లో భాగంగా సీఆర్‌డీఏ పరిధిలో ఈనెల 26న పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్న దృష్ట్యా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుతో కలసి వివిధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్లు వేణుగోపాలరెడ్డి, ఢిల్లీరావు మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా రెండు జిల్లాల లబ్ధిదారులకు సీఆర్‌డీఏ పరిధిలోని వెంకటపాలెం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు ప్రాంతాల్లో లే అవుట్లు సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమానికి రెండు జిల్లాల నుంచి లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొంటున్న దృష్ట్యా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్, తాగునీరు అందించనున్నామని, ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్, పారిశుద్ధ్య పనులు పూర్తి చేశామని చెప్పారు. సభ వద్ద కూడా అపశ్రుతులు జరకుండా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. మొబైల్ టాయిలెట్లుతో పాటు పార్కింగ్, సభా ప్రాంగణం దగ్గర లబ్ధిదారులు కూర్చునేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు వివిధ శాఖ అధికారులకు బాధ్యతలు అప్పజెప్పినట్లు వారు తెలిపారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, ఎన్‌టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ సంపత్‌కుమార్, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ఆలీం బాషా, అడిషనల్ ఎస్పీ అనిల్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, విజయవాడ సబ్ కలెక్టర్ అజితేసింగ్, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ షేక్ కరీం, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ ఘని, డీపీవో కేశవరెడ్డి, డెప్యూటీ కలెక్టర్ మోవిడి వాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి. సమావేశంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ తలశిల తదితరులు

సకాలంలో ‘అమ్మ ఒడి’కి చేరువ

- పాఠశాలలు తెరిచిన వెంటనే ఖాతాల్లోకి నగదు
- జిల్లాలో గత ఏడాది 1,92,605మందికి రూ.288.90కోట్ల పంపిణీ
- సచివాలయ స్థాయిలోనే సమస్యల పరిష్కారం
- ఇప్పటికే ప్రాథమిక జాబితా సిద్ధం చేసిన అధికారులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న అమ్మ ఒడి పథకాన్ని అర్హులైన విద్యార్థులందరికీ అందేలా అధికారులు కృషి చేస్తున్నారు. పథకం ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు కావస్తోంది. ప్రతి ఏడాది సకాలంలో విద్యా ర్థుల తల్లుల ఖాతాల్లో నగదు చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ పాఠశాలలు తెరిసిన మరుసటి రోజే జమ చేసేలా కసరత్తు చేస్తున్నారు. గత ఏడాది జిల్లా పరిధిలో 1,92,605 మందికి రూ.288.90కోట్లను తల్లుల ఖాతాలకు జమ చేశారు. వీరిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,66,019మంది, ఇంటర్ విద్యార్థులు 26,586మంది ఉన్నారు. ఈ ఏడాది మరింత మందికి లబ్ధి చేకూ రేలా విద్యాశాఖాధికారులు శ్రద్ధ తీసుకుంటున్నారు.

25నుంచి అందుబాటులో జాబితా

చైల్డ్ ఇన్ఫోతో అనుసంధానమై ఉన్న అమ్మఒడి పథకానికి అర్హులైన లబ్ధిదారుల జాబితాలు ఈనెల 25వతేది నుంచి అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఉంచి తల్లిదండ్రులు పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లోనూ జాబితా అందుబాటులో ఉంటుంది. అర్హులు, అనర్హుల జాబితాను పరిశీలించుకొని సచివాలయాలకు తగిన ధ్రువపత్రాల్ని సమర్పించి, అర్హత పొందేందుకు అవకాశం కల్పిస్తారు. నిజమైన అర్హత గలవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులు కూడా శ్రద్ధ వహిస్తున్నారు.

అర్హులకే లబ్ధి

వెబ్‌సైట్‌లోని జాబితా మేరకు సచివాలయ విద్యా కార్యదర్శి సంబంధిత లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తి చేయాలి. ఆధార్ సెంటర్‌లో ఫింగర్ అప్డేట్‌తో పాటు ఫోన్ నంబర్ లింక్ చేయాలి. ఆధార్ కార్డ్ అనుసంధానం చేసిన బ్యాంక్ ఖాతాలోనే నగదు జమ అవుతుంది. ఆధార్ కార్డ్ వేర్వేరు బ్యాంక్ అకౌంట్లతో అనుసంధానమై ఉంటే సాంకేతిక సమస్యలు తలెత్తి జమ కాదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. తల్లి, విద్యార్థి ఒకే హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉండాలి. బ్యాంక్‌లో కొనసాగుతున్న ఎకౌంట్‌ను మాత్రమే ఆధార్‌తో లింక్ చేయాలి. ఇటువంటి సమస్యల్ని సచివాలయ స్థాయిలోనే పరిష్కరించి అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రానున్న 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే తుది జాబితా సిద్ధం చేయనున్నారు. వాటి ప్రకారం తల్లుల ఖాతాలో నగదు జమ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



పాఠశాల విద్యార్థులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలు



అర్హులైన ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కంటే లబ్ధిదారులు పెరిగే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఈకెవైసీ చేయించి ఆధార్‌ను బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్‌కు లింక్ చేయించాలి. అర్హత ఉండి లబ్ధి పొందని వారు సవరించుకొనే అవకాశం ఉంది.

– కె.శామ్యూల్, డీఈవో, పల్నాడుజిల్లా

క్లుప్తంగా

చెక్క నాటు తుపాకీ స్వాధీనం

నిందితుడు అరెస్ట్

అచ్చంపేట: పల్నాడు జిల్లా మాదిపాడు పంచాయతీ జడపల్లిమోటుతండాలో భూక్యా బద్దూనాయక్ అనే వ్యక్తి నుంచి చెక్కనాటు తుపాకీ స్వాధీనం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. శనివారం రాత్రి జడపల్లి మోటు తండాలో నాటుసారా విక్రయదారులను పట్టుకునేందుకు ఎస్ఐ కె.పాల్‌రవీంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తండాకు చెందిన భూక్యా బద్దూనాయక్ మావోయిస్టు సానుభూతి పరుడని, మావోయిస్టులు అతనికి గతంలో ఒక తుపాకీ ఇచ్చారన్న సమాచారంతో అతని ఇంటికి వెళ్లి చూడగా నాటుచెక్క తుపాకీ కనిపించడంతో వెంటనే స్వాధీనం చేసుకున్నారు. బద్దూనాయక్‌ని అదుపులోకి తీసుకుని ఆదివారం రాత్రి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. అయితే బద్దూనాయక్ వద్ద చెక్క తుపాకీ ఉందన్న పక్కా సమాచారంతోనే పోలీసులు గ్రామానికి వెళ్లారా, గ్రామానికి వెళ్లిన తరువాత విషయం తెలుసుకుని తుపాకీ స్వాధీనం చేసుకున్నారా అనే విషయాలు తెలియవలసి ఉంది. అయితే అదేమంత పెద్ద విషయం కాదని, అది పనికిరాని చెక్క తుపాకీ అని ఎస్ఐ కొట్టిపారేస్తున్నారు.

వాహనం బోల్తా పడి పలువురికి గాయాలు



విజయపురిసౌత్: వాహనం బోల్తా పడటంతో నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి నుంచి విజయపురి సౌత్‌లోని సాగర్‌మాత దేవాలయానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో కుడి జలవిద్యుత్ కేంద్రం మూల మలుపు వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న శ్రీరామ మల్లేశ్వరి, మంత్రాలమ్మ, సుజాత, ఎండవల్లి సీతారావమ్మలకు తీవ్ర గాయాలు కాగా దాసరి కమలకుమార్‌తోపాటు ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

దాతృత్వం చాటుకున్న జిల్లా కలెక్టర్

దివ్యాంగుడికి రూ.40 వేలు ఆర్థిక సహాయం



దివ్యాంగునికి నగదు సహాయం చేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: స్వశక్తితో కుటుంబాన్ని పోషించుకుంటూ మరికొందరికి ఉపాధి చూపించాలన్న సంకల్పంతో చిన్న తరహా పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాలన్న ఓ దివ్యాంగునికి రూ.40 వేల ఆర్థికసాయం చేసి కలెక్టర్ ఎల్ శివశంకర్ మానవత్వాన్ని చాటుకున్నారు. పల్నాడు జిల్లా ఏనుగుపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు గుడిపూడి అంకారావు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) ద్వారా రూ.10 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ పథకం రుణం పొందేందుకు సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రుణం అందించేందుకు అంగీకరించారు. ఈ పథకంలో లబ్ధిదారుల వాటా 5శాతం బ్యాంకులో నగదు జమ చేయాల్సిఉండగా అంకారావు వద్ద రూ.10 వేలు మాత్రమే ఉన్నాయని, తన ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి రూ.40 వేలు ఆర్థిక సహకారం అందించాలని వేడుకున్నాడు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సొంతంగా రూ.40వేలు ఆర్థికసాయం అందించారు. త్వరలో లబ్ధిదారుడు అంకారావు ఏర్పాటు చేసుకునే 'చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్' యూనిట్ పీఎంఈజీపీ పథకం ద్వారా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

చిన్న పిల్లలతో బిక్షాటన చేస్తే చట్టపరమైన చర్యలు

- బిక్షాటన చేస్తున్న మహిళలను కలెక్టరేట్‌కు తీసుకొచ్చిన అధికారులు
- మరోసారి ఇటువంటి పనికి పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: చిన్నారులను ఆసరాగా చేసుకొని బిక్షాటన చేస్తున్న పలువురు మహిళలను సోమవారం జిల్లా బాలల పరిరక్షణ శాఖ, ఎన్జీవో ప్రతినిధులు కలసి అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు బాలల పరిరక్షణ శాఖ అధికారులు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ఇతర పరిసర ప్రాంతాలలో పర్యటించి కొంతమంది మహిళలు, చిన్నపిల్లలను అంటిపెట్టుకొని బిక్షాటన చేస్తున్న విషయాన్ని గమనించి అదుపులోకి తీసుకొని వారిని జిల్లా కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. మొత్తం నలుగురు మహిళలు వారి సంబంధించిన మరో పదిమంది బిక్షాటన చేస్తున్నట్లు, వారి వివరాలు సేకరించి కలెక్టర్‌కు అందించారు. సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వారికి ప్రభుత్వం పథకాలు అందుతున్నయా? లేదా అని ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లలు అడ్డుపెట్టుకొని వారి ద్వారా బిక్షాటన చేయడం తప్పని హితవు పలికారు. ఇప్పటికైనా మీలో మార్పు రావాలని సూచించారు. మీ పిల్లలందరూ పాఠశాలలో చేర్పించేలాగా అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. మీరూ కూడా బిక్షాటన చేయకుండా పనులు చేసుకోవాలని సూచించారు. మళ్లీ ఇటువంటివి జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. బిక్షాటన చేస్తున్న మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఎన్జీవో సంస్థ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగ అధికారి బి.విజయ్‌కుమార్, న్యాయ పరిరక్షణ అధికారి బి.శాంతి, ఏహెచ్‌టీయు సీహెచ్ అల్లురెడ్డి దీనమ్మ, రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, స్వచ్ఛంద సేవా సంస్థ, చైల్డ్ లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు కిందపడి బీటెక్ విద్యార్థి మృతి

రెంటచింతల: మండల పరిధిలోని పాలువాయి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ఆదివారం రాత్రి గుంటూరులో రైలు కింద పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన జి.నితిన్‌రెడ్డి(19) గుంటూరు పట్టణంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శవపంచనామా అనంతరం సోమవారం సాయంత్రం పాలువాయి గ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఫిర్యాదును శ్రద్ధతో పరిష్కరించండి

- జిల్లా పోలీసు కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహణ
- 72 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ



బాధితుల సమస్య వింటున్న జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహిస్తూ నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 72 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు తదితర సమస్యలకు సంబంధించినవి స్వీకరించారు. ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయసహకారాలు అందించారు. సమస్యలు విన్నవించుకోవడానికి విచ్చేసిన ప్రజలకు పట్టణానికి చెందిన మురళి పెయింట్స్ యజమాని కోట లక్ష్మణ, కాకుమాను బజారు గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ కొత్త పెద్దన్నల ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, డి.పల్లపురాజు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీసా ఇప్పిస్తానని రూ.13లక్షలు తీసుకున్నారు

విదేశాల్లో వర్క్ పర్మిట్ వీసా ఇప్పిస్తానని రూ.13 లక్షలు తీసుకొని పనిచేయకపోగా మొహం చాటేస్తూ డబ్బులు అడిగితే బెదిరిస్తునారు.

–బాధితుడు, పిడుగురాళ్ల

ప్రేమ పేరుతో మోసం చేశాడు

ప్రేమ పేరుతో మోసం చేసి, శారీరకంగా వాడుకొని పెళ్లి చేసుకోమంటే అధిక కట్నం ఇవ్వాలని లేదంటే పెళ్లి చేసుకోనని, అదేమని అడిగితే బెదిరిస్తున్నాడు.

– ఓ యువతి, నరసరావుపేట పట్టణం

రూ.70లక్షల మిర్చిపంటను తీసుకొని మోసం

సుమారు రూ.70 లక్షల విలువైన మిర్చి పంటను 46 మంది రైతులు ఒక వ్యాపారికి విక్రయించి నగదు చెల్లించమంటే నిరాకరిస్తున్నాడు. డబ్బులు ఇవ్వకపోగా మీకు చేతనైనది చేసుకోమంటూ బెదిరిస్తున్నాడు. అతడి వద్ద నుంచి తమ పంట నగదును ఇప్పించి న్యాయం చేయాలి.

–రైతులు, తేలుకుట్ల గ్రామం, గురజాల

ఎమ్మెల్యే మద్దాళి గిరికి మాతృ వియోగం

సంతాపం తెలిపిన నేతలు

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాతృమూర్తి మద్దాళి శివపార్వతి (68) స్వర్గస్తులయ్యారు. సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. శివపార్వతి భౌతికకాయాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మేరుగ నాగార్జున, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, కిలారి రోశయ్య, నంబూరు శంకరరావు, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్లు షేక్ సజిల, వనమా బాలవజ్రబాబు, జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, పార్టీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.



ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తల్లి శివపార్వతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విడదల రజిని

అధిక ధరలకు క్లాసిక్ మిరప విత్తనాలు

అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్న అధికారులు

అమరావతి: క్లాసిక్ మిరప విత్తనాలకు డిమాండ్ పెరిగింది. డిమాండ్ ఆసరా చేసుకుని కొంతమంది డిస్ట్రిబ్యూటర్లు అధిక ధరలకు అమ్ముతూ రైతులను దోపిడీ చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.70లక్షల ఎకరాలలో మిరప సాగుచేశారు. రైతులు తమ పొలాల్లో అనేకరకాల కంపెనీలకు చెందిన మిరప విత్తనాలను విత్తారు. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ రైతులు సీమోన్ కంపెనీకి చెందిన క్లాసిక్ మిరప విత్తనాలు విత్తారు. ఈ విత్తనాలు బొబ్బరతెగులు, నల్లి తెగులును తట్టుకుని ఎకరాకు సుమారుగా 40 క్వింటాళ్ల దిగుబడి ఇవ్వటంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 17వేల ఎకరాలలో సాగు చేయటానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విత్తనాల కోసం నిత్యం గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట పట్టణాలలో విత్తన దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూటర్లు డీలర్లకు విత్తనాలు సరఫరా చేయటం లేదు. విత్తనాల ప్యాకెట్ ధర ఎంఆర్‌పి రూ.1360 ఉండగా రూ.1700 నుంచి రూ.2000 వరకు నేరుగా డిస్ట్రిబ్యూటర్లే అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. గ్రామాల నుంచి వచ్చి అడిగితే స్టాకు లేదని చెప్పి అధిక ధర చెల్లించిన వారికి దొడ్డిదారిన అమ్ముకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పల్నాడు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళి వివరణ ఇస్తూ క్లాసిక్ విత్తనాలు మండల స్థాయిలో విత్తన దుకాణాలలో అందుబాటులో లేని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ అంశం పరిశీలించి మండల స్థాయిలో విత్తన దుకాణాలలో విత్తనాలు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దేవుడిలా మా బిడ్డను కాపాడారయ్యా..

- మీరు చిరకాలం అధికారంలో ఉండి మాలాంటి వారికి మేలు చేయాలయ్యా..
- నాడు రోగి లివర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆపరేషన్‌కు రూ.18 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- నేడు ఆరోగ్యంగా యువకుడు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కన్నీటితో కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



కన్నీటితో కృతజ్ఞతలు తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

మాచర్ల: మూడేళ్ల క్రితం పట్టణంలోని 22వ వార్డుకు సంబంధించిన ఉప్పుతోళ్ల వెంకయ్య, నర్సమ్మ కుమారుడు లివర్ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడ్డాడు. ఈ నేపథ్యంలో వారు పలు ఆసుపత్రులు తిరిగారు. ఏం చేసినా లాభం లేదని లివర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆపరేషన్ చేయకపోతే చనిపోతాడని, తప్పక చేయాలని వైద్యులు తేల్చిచెప్పారు. దీనికి రూ. 18లక్షలు ఖర్చు అవుతుందని చెప్పగా రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దగ్గరికి ఆ కుటుంబం వెళ్లి తమ సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా.. ఎంత ఖర్చుఅవుతుందని అడిగి తెలుసుకొని పీఆర్కే సిఫారసు ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 18లక్షలను మంజూరు చేశారు. ఈ రిలీఫ్ ఫండ్‌తో ఉప్పుతోళ్ల వెంకయ్య, నర్సమ్మలు లివర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆపరేషన్ చేయించి, తమ కుమారుడిని కాపాడుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పట్టణంలో పీఆర్కే వార్డులో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారి ఇంటి వద్దకు వెళ్లగానే వారు పెద్దపెట్టున ఆనందంగా ''మా బిడ్డను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మీరు కాపాడారయ్యా.. ఆపరేషన్‌కు అయిన ఖర్చంతా భరించి, అతనికి నూతన జీవితం ఇచ్చారయ్యా.. మీరు చిరకాలం అధికారంలో ఉండాలయ్యా.. మా లాంటి వారందరికీ ఇంకా మంచి చేయాలయ్యా..'' అంటూ చెమర్చిన కళ్లతో చెప్పారు. వారిని ఓదార్చి భవిష్యత్తులోనూ ఇదే విధంగా వైఎస్సార్ సీపీ పేదల కోసం కృషి చేస్తుందని పీఆర్కే చెప్పారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, ఆయా వార్డు కౌన్సిలర్లతో పాటు పలువురు వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

సింహద్వారం ఏర్పాటు అభినందనీయం

రెంటచింతల: పాలువాయి గ్రామంలో వేంచేసిన అతి పురాతనమైన గంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానానికి వైఎస్సార్ సీపీ నాయకులు మందలపు హనిమిరెడ్డి, మందలపు సైదారెడ్డి వారి పూర్వీకుల జ్ఞాపకార్థం లక్షల రూపాయల వ్యయంతో సింహద్వారం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాత పాలువాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన సింహద్వారానికి ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ మందలపు విజయలక్ష్మి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు గార్లపాటి శివప్రసాద్ నేతృత్వంలో ఆగమ శాస్త్ర పండితులు జిగురు చంద్రశేఖరశర్మ, జిరుగు ప్రసాదశర్మ, జిగురు శంకర్‌శర్మలు పూజలు జరిపించారు. మధ్యాహ్నం 12.30గంటల నుంచి ఈ మహోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు ప్రభుత్వ విప్ పీఆర్కే మహా అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. సచివాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన మంచినీటి ట్యాంక్‌ను, సర్పంచ్ విజయలక్ష్మి నివాసంలో ఏర్పాటు చేసిన రాధాకృష్ణుల విగ్రహాలను ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, పార్టీ నేతలు మందలపు హనిమిరెడ్డి, మందలపు సైదారెడ్డి, పోట్ల ముత్తయ్య, సర్పంచ్‌లు మున్నా చంద్రం, బాలునాయక్, ఉప సర్పంచ్ గొడుగు సైదులు, మందలపు శ్రీనివాసరెడ్డి, గొట్టం బ్రహ్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చల్లా మట్టారెడ్డి పాల్గొన్నారు.